అభివృద్ధి ఏదీ.. సౌకర్యాలు ఎక్కడ?

- అధికారులను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- అడ్డు తగిలిన టీడీపీ కార్పొరేటర్లు
- నగరపాలక కౌన్సిల్ సర్వసభ్య సమావేశం రసాభాసా
- టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండిపడిన మేయర్
- రూ. 7.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్


టీడీపీ కార్పొరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ బీవై రామయ్య


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరిస్తున్న టీడీపీ కార్పొరేటర్ పరమేష్

కర్నూలు (టౌన్): 'ఏడాది కాలంగా పనులు జరగడం లేదు. టెండర్లు లేవు. పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలతో స్థానిక ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నాం' అంటూ పలువురు కార్పొరేటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కనీసం సంక్షేమ పథకాలు ఇవ్వలేదు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డబ్బులు లేవా... పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకుంటే ఎలా'.. అంటూ సభలో అధికారులను నిలదీశారు. కౌన్సిల్ సమావేశానికి అంటే పిక్నిక్‌కు వచ్చినట్లు ఉంది. స్నాక్స్ తినడం. కూర్చోవడం, వెళ్లి పోవడం తప్పా.. పనులు జరగడం లేదు' అని వాపోయారు. సుదీర్ఘంగా జరిగిన చర్చలో సభ్యులు వాదోపవాదాల మధ్య 25 అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. రూ.7.22 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. శనివారం స్థానిక నగర పాలక నూతన కౌన్సిల్ సమావేశంలో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు తొలిసారిగా సమావేశానికి వచ్చిన కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజుకు మేయర్, కమిషనర్ సన్మానం చేశారు. అనంతరం కశ్మీర్‌లో ఉగ్రదాడిలో చనిపోయిన యాత్రికులకు, అలాగే ఇటీవల 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ మృతి చెందడంపై కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకు ముందు కర్నూలు పార్లమెంటు సభ్యులు నాగరాజు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ పెట్టి, వాటి పురోగతిని ఆయా సభ్యులకు తెలియజేయాలన్నారు. అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ కల్లూరు 16 వార్డులో నగరపాలక సంస్థకు పన్నుల ద్వారా అత్యధికంగా ఆదాయం వస్తుందని, అయితే తాగునీటి సమస్య అనేక కాలనీల్లో పరిష్కారం కావడం లేదన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కర్నూలుకు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చెత్త సమస్య తీవ్రంగా ఉందని, పుష్‌గాట్‌లు లేవని, క్లాప్ ఆటోలు లేక నగరంలో చెత్త సమస్య మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు అర్బన్‌లో మూడు వార్డులు ఉన్నాయని, మంచినీటి సమస్య, మురుగు కాల్వల సమస్య తీవ్రంగా ఉందన్నారు. కేసీ కెనాల్‌లో మురుగునీరు ఎక్కువైందన్నారు. సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. క్రిష్ణ, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

సమావేశం ప్రారంభంలో పలువురు కార్పొరేటర్లు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మినిట్స్ నమోదు చేస్తున్నారా.. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఏ స్థాయిలో ఉన్నాయంటూ కార్పొరేటర్ ఆర్షియా పర్వీన్ ప్రశ్నించారు. సమాధానం చెప్పాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చారు. అయితే కమిషనర్ స్పందించే లోపు టీడీపీ ఫ్లోర్ లీడర్ పరమేష్ అడ్డు తగిలారు. అయితే ప్రతి ప్రశ్నకు టీడీపీ కార్పొరేటర్ ఎందుకు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నిలదీశారు. అయినా పరమేష్ తీరు మారక సభలో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడే ఉన్న పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. సభ్యులు సంయమనం పాటించాలని మేయర్ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. కాగా సమావేశంలో పలువురు అధికారులపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పట్టించుకోవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు సుదర్శన్ రెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, రాజేశ్వరరెడ్డి నారాయణ రెడ్డి, నరసింహులు, సాన శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, షేక్ అహమ్మద్, షేక్ యూనుస్‌బాషా, జుబేర్, సిత్రా సత్య నారాయణమ్మ, షాషావలీ, అరుణ అధికారులను నిలదీశారు.

టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండి పడిన మేయర్

నగర మేయర్ బీవై రామయ్య టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండి పడ్డారు. సభలో అందరూ మాట్లాడవచ్చని, సభ్యులు మాట్లాడితే మీరు సమాధానం చెప్పేందుకు పదే పదే ఎందుకు లేస్తున్నారంటూ మేయర్ ప్రశ్నించారు. అయితే ఖాతరు చేయని ఆయన అదే స్థాయిలో మాట్లాడుతుంటే 'పరమేష్ మీ గురించి అంతా తెలుసు. కార్పొరేషన్‌లో ఏం చేస్తున్నావో.. కూర్చో.. కొంచెం తగ్గు' అంటూ గట్టిగా సమాధానం ఇచ్చారు. కార్పొరేటర్లు సైతం అదే స్థాయిలో నిలదీయడంతో చేసేదేమి లేక కూర్చున్నాడు.

మూడు కూడళ్లు, రెండు ప్రాంతాలకు కొత్త పేర్లు

నగరపాలక సర్వ సభ్య సమావేశంలో కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు సూచనల మేరకు ఆనంద్ టాకీస్ నుంచి కిసాన్ ఘాట్‌కు పోయే రోడ్డు సర్కిల్‌కు శ్రీకనకదాసు సర్కిల్, కర్నూలు మరాఠ సేవ సంఘం విన్నపం మేరకు కోడుమూరు రోడ్డులో ఉల్చాల వై జంక్షన్ కూడలికి ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్‌గా, బంగారుపేట, శ్రీరామ టాకీస్ వద్ద ఉన్న సర్కిల్‌కు బసవ సర్కిల్‌గా నామకరణం చేశారు. అలాగే పాతబస్తీలోని బేకారి కట్ట వీధికి జనాబ్ అబ్దుల్ సలాంఖాన్ సాహెబ్‌గా, గరీబ్‌నగర్‌కు డాక్టర్ ఇస్మాయిల్ హుస్సేన్‌గా కొత్త పేర్లు ఆమోదించారు.



మౌనం పాటించి ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు

క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాలలో స్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉదయాన్నే పనుల్లోకి రావాలి


కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలంతా మండుతున్న ఎండల దృష్ట్యా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా ముగించుకుని వెళ్లాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శనివారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300ల వరకు పడుతుందని చెప్పారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి


కర్నూలు(రూరల్): స్పౌజ్ కింద మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 1నుంచి 2024 అక్టోబర్ 31 మధ్యలో పింఛన్ తీసుకుంటూ చనిపోయివుంటే వారి భార్యకు వితంతు పింఛన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లింక్ ప్రారంభమైందన్నారు. అర్హులు ఆధార్‌కార్డు, పింఛన్ పుస్తకం, రేషన్‌కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించి ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాకపోకలకు అంతరాయం


పాణ్యంలో బ్రిడ్జికి వేలాడుతున్న కేబుల్‌వైర్

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని వీయూపీ (వెహికల్ అండర్ పాస్)బ్రిడ్జికి ఓ కేబుల్ వైర్‌ను లారీ ఢీకొనడంతో కిందకు వేలాడింది. దీంతో దాదాపుగా అరగంటకు పైగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు, బీఎస్ఎన్ఎల్ అధికారులకు సమాచారం అందించి వైర్‌ను బ్రిడ్జికి యథావిధిగా కట్టారు. తర్వాత భారీ వాహనాలు, బస్సులు రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి.

భక్తిశ్రద్ధలతో తైలాభిషేకం


శనైశ్చర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్చర స్వామివారికి తైలాభిషేకం, అర్చనలు, శనైశ్చర హోమం తదితర పూజలు విశేషంగా జరిగాయి.

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగుతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా విధానంలో శాస్త్రీయత ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, సంయుక్త కార్యదర్శి సంయుక్త పాల్గొన్నారు.

తేనే టీగల పెంపకంపై శిక్షణ



బలపనూరు తేనేటీగల శిక్షణ కేంద్రం వద్ద గిరిజనులు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు మెట్ట వద్ద ఉన్న నల్లమల తేనేటీగల పెంపకంపై ఆత్మకూరు డివిజన్ పరిధిలోని గిరిజనులకు శిక్షణ ఇచ్చారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శనివారం బలపనూరు వద్ద ఉన్న నల్లమల బీ హనీ సెంటర్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రమేష్, ఇలాయాస్ మాట్లాడుతూ తేనేటీగల పెంపకం ఎలా చేయాలి, ఏ ప్రాంతంలో తేనేటీగలు జీవిస్తాయి. తేనేతో పాటు పుప్పాడి, మైనం ఎలా తీయాలి అనే అంశంపై వివరించారు. అలాగే తేనె టీగలు జీవించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాటి ఆరోగ్యం తదితర వాటిపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

7న నిమిషాంబా దేవి జయంతోత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ చిత్తారి వీధి శ్రీ నిమిషాంబా దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మే 7వ తేదీన నిమిషాంబా దేవి జయంతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, రాత్రి ఊంజల్ సేవ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్ బాబు అభినందన సభ

కర్నూలు కల్చరల్: శ్రీశైలం ప్రాజెక్ట్ విశ్రాంత సర్కిల్ అధికారి, మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్ బాబు అభినందన సభను ఆదివారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాటక రంగంలో ట్రిబుల్ యాక్షన్‌తో శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి శయన ఘట్టం టెలిఫిలిం నిర్మించినందుకు, సీనియర్ సినిమా హీరోల గెటప్‌లతో షార్ట్‌ఫిలిం నిర్మించినందుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు టి.రాముడు, ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం శరీన్‌నగర్, బిర్లాగడ్డ మట్టి అడ్డాల్లో కార్మికులకు మంచినీరు, నీడ, టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు రుణాలు ఇవ్వాలని, పిల్లల చదువుకు సహకారం అందించాలని కోరారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. సీఎం తీరును నిరసిస్తూ ఈనెల 28వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కాజాపాషా, జి.ఏసు, డి.అబ్దుల్లా బతుకన్న పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. శనివారం సూర్యనారాయణ భవన్‌లో జరిగిన పార్టీ న్యూసిటీ కమిటీ సమావేశంలో స్మార్ట్ మీటర్లు మాకొద్దు – కరెంట్ చార్జీలు తగ్గించాలని అనే నినాదంతో ఉన్న స్టిక్కర్లను ఆమె పార్టీ నాయకులు టి.రాముడు, సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.అరుణ, కె.ప్రభాకర్, వై.నగేష్, శ్యామల, ఏసు, మహ్మద్ రఫీలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ...అధికారంలోకి రాగానే వాటికే అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించము అని చెప్పిన హామీని తుంగలోకి తొక్కిందన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ..


కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

కల్లూరు : కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ కల్లూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం కల్లూరు మండల అధ్యక్షుడు మధుసూదన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నీలం సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పరమేష్, మండల అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి జరిపి 28 మందిని హతమార్చడం అత్యంత బాధకరమన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూజేఎఫ్ సభ్యులు వైపీ రెడ్డి, ఎన్నికల డీటీ అనురాధ, సీనియర్ ఫొటోగ్రాఫర్ సోమశేఖర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకులు


మాట్లాడుతున్న సేవ్ వక్ఫ్‌జేఏసీ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈనెల 28వ తేదీన కర్నూలు నగరంలో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, డి.అబ్దుల్‌దేశాయ్, ఇంతియాజ్ తెలిపారు. ఈ ర్యాలీకి మతాలు, కులాలకు అతీతంగా రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకునే వరకు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సేవ్ వక్ఫ్ పేరుతో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఇస్లామీయా అరబిక్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కుంగుతున్న గోరుకల్లు కట్ట


కుంగుతున్న కట్ట

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయ కట్ట నానాటికి కుంగిపోతుంది. జలాశయంలో నీరు తగ్గే కొద్ది బండపరుపు జారిపోతుంది. దీంతో రిజర్వాయర్ నీటిపై ఆధారపడిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంజినీర్లు గోరుకల్లు రిజర్వాయర్‌ను ఫాల్ట్ జోన్‌గా గుర్తించి నిత్యం పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం 5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డ్రోన్ వినియోగంపై అవగాహన


డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న జేడీ వరలక్ష్మి, వ్యవసాయాధికారులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని మామిదాలపాడు గ్రామంలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం ద్వారా పురుగుమందు పిచికారీపై గ్రామ రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వరలక్ష్మి, ఏడీ రూఫ్స్ రోనాల్డ్ ఆధ్వర్యంలో శనివారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే విధంగా జిల్లాకు దాదాపు 35 డ్రోన్‌లు మంజూరు చేసిందన్నారు. ఇందులో కర్నూలు మండలానికి ఒకటి కేటాయించారని చెప్పారు. డ్రోన్ విలువ రూ.9.50 లక్షలు ఉండగా ప్రభుత్వం ఐదు గురు రైతులకు రూ.2.50 లక్షలకు సబ్సిడీపై అందజేస్తుందన్నారు. స్ప్రేయర్లతో ఎకారకు 200 లీటర్ల నీరు అవసరమైతే...డ్రోన్‌తో కేవలం 10 లీటర్లలో పిచికారీ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు


సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు

కోడుమూరు రూరల్ : గూడూరులో వెలసిన తిమ్మగురుడు స్వామి తిరునాలను పురస్కరించుకుని చైతన్య యూత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి. స్పీడ్ సైకిల్ పోటీలు నిర్వహించగా.. పోటీలను మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఇందులో అరుణ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలువగా బహుమతిగా కొత్త సైకిల్, 2వ స్థానంలో నిలిచిన చంద్రకు బహుమతిగా రూ.2016 నగదును చైతన్యయూత్ సభ్యులు అందజేశారు. అలాగే పరుగుపందేన్ని మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు ప్రారంభించగా.. చనుగొండ్ల చంద్ర విజేతగా నిలువగా రూ.3016, రెండవ స్థానంలో నిలిచిన శివకు రూ.2016 నగదును నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దస్తగిరి, జింకల కుమార్, విజయుడు, బజారి, మాజీ ఉపసర్పంచు జిలానీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ వినియోగాన్ని పెంచాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రైతులు డ్రోన్ వినియోగాన్ని పెంచుకుని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చునని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు. శనివారం కర్నూలు ఉద్యానభవన్‌లో డ్రోన్‌ల వినియోగంపై గ్రూపుల కన్వీనర్, కో–కన్వీనర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ బి.నవ్య కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు డ్రోన్ ఎలా పనిచేస్తుంది. పురుగు మందులు ఏ విధంగా పిచికారి చేస్తుందనే దానిని ప్రయోగాత్మకంగా వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన దేశం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడిందని, వ్యవసాయంలో అభివృద్ధి ఉంటేనే ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక ఉత్పాదకతను పెంచుకోవడానికి సాంకేతికత ఎంతో అవసరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఎల్‌డీఎం రామచంద్రరావు, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి, ఏడీఏలు, డ్రోన్ గ్రూపు కన్వీనర్లు, కో–కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం చల్ల'కుండ'!

- పేదవాడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ
- వేసవిలో మట్టికుండల్లోని నీటిని తాగేందుకే ప్రజల మొగ్గు
- ఇంట్లో ఫ్రిజ్‌లు ఉన్నప్పటికీ కుండల కొనుగోలు
- ఒక్కో కుండ ధర సైజును బట్టి రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయం


మట్టికుండలను కొనుగోలు చేస్తున్న మహిళలు


సంతలో అమ్మకానికి పెట్టిన మట్టికుండలు

కోడుమూరు రూరల్ : వేసవి వచ్చిందంటే చాలు మట్టి కుండలకు డిమాండ్ భారీగా ఉంటుంది. మట్టి కుండల్లో పోసిన నీరు చల్లగా ఉంటుండడంతో పాటు ఆరోగ్యానికి మంచిదని చాలామంది వీటినే తాగేందుకే ఇష్టపడుతున్నారు. వీటిని చాలామంది ప్రజలు పేదవాడి ఫ్రిజ్‌లుగా భావిస్తారు. ఫ్రిజ్‌లోని నీటికన్నా కుండల్లోని నీటిని తాగితే ఆరోగ్యానికి మేలని వైద్యులు చెబుతున్నారు. ఇళ్లల్లో ఫ్రిజ్‌లున్నప్పటికీ చాలామంది మట్టి కుండల వైపే మొగ్గు చూపుతున్నారు. వేసవి దృష్ట్యా ప్రతి శనివారం కోడుమూరులో జరిగే సంతలో మట్టికుండలను కొనుగోలు చేసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువగా వస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మట్టి కుండల ధర కొంచెం ఎక్కువగా ఉంది. ఒక్కో మట్టి కుండ సైజును బట్టి రూ.200 నుంచి రూ.350ల వరకు ధర పలుకుతోంది.

మట్టి కుండలోని నీరే బాగుంటుంది



ఫ్రిజ్‌లు, స్టీల్ ట్యాంకుల్లో నీటి కన్నా మట్టి కుండలోని నీరే బాగుంటుంది. మా ఇంట్లో నిత్యం మట్టి కుండలోని నీటినే తాగుతాం. వేసవిలో కుండ చుట్టూ ఇసుక వేసి తడిసిన బట్ట వేస్తే ఫ్రిజ్‌లో మాదిరే నీరు చల్లగా ఉంటుంది. పైగా మట్టి కుండల్లోని నీరు తాగితే మనుషులు కూడా ఆరోగ్యంగా ఉంటారు.

– నాగరాజు ఆచారి, కోడుమూరు

అ'పూర్వ' కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. గ్రామంలో హైస్కూల్లో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పిన పూర్వపు ఉపాధ్యాయులను జ్ఞాపికలు, పూల మాలలతో సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ప్రవీన్ కుమార్, తిమ్మప్ప, జాకీర్, మాదన్న, కలాం, నాగరాజు, పూర్వ ఉపాధ్యాయులు వెంకటరమణ, సవారన్న, గఫార్, పద్మావతి, లక్ష్మిబాయి, సర్వార్‌సాహేబ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.